## వేడుకలు..

# ప్రచార వేదికలు

**ఫంక్షన్‌లలో ప్రచారానికి సిద్ధమవుతున్న పార్టీలు.. పెండ్లిళ్లు, రిసెప్షన్లు, గృహ ప్రవేశాల తేదీలపై ఆరా.. ముఖ్య నేతలతో కలిసి వెళ్లేందుకు ప్రణాళికలు**

*'అన్నా.. ఎట్లయినా పలానా కులపోళ్లని వదలొద్దే. పొయినసారి ఎలక్షన్‌లప్పుడు వాళ్లు మనకే ఏసిండ్రు. కాక కొడుకుది ఎంగేజ్‌మెంట్ వస్తుంది. ఆ రోజు అందరం పొయ్యి కలిసి రావాలె' ఓ పార్టీ ప్రధాన నాయకుడితో ముఖ్య కార్యకర్త మాట ఇది..*

*'తాత.. మా పాలోని పెండ్లి ఉందే. జర మనోళ్లందరిని ఆ రోజు సూపియ్యాలె. ఎట్లయినా మనకే ఓటేసేటట్టు చెయ్యాలె. జర ఎక్కువ మందే కనిపించేటట్టు సూడే'.. మరో పార్టీ గ్రామ అధ్యక్షుడితో వరుసకు మనవడయ్యే కార్యకర్త విజ్ఞప్తి..*

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 11 : ఎన్నికలు ముంచుకొచ్చిన తరుణంలో మంచి శకునాన్ని తమకు అనుగుణంగా మలుచుకునేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. గృహ ప్రవేశాలు, లగ్గాలకు మంచి ముహూర్తాలు దగ్గర పడటం, ఇప్పటికే కొన్ని దావత్‌లు సైతం ప్రారంభం కావడంతో ఎలాగైనా తమవైపు తిప్పుకొనేందుకు ఆరాటపడుతున్నారు. నామినేషన్ల పర్వం మొదలుకావడంతో ప్రధాన రాజకీయ పార్టీల ప్రచారం జోరందుకుంటున్నది. ప్రచారంలో బీఆర్‌ఎస్ ఇప్పటికే దూసుకుపోతుండగా.. ఇతర పార్టీలూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ఇప్పటికే బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్.. ఆ తర్వాత కాలనీవారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నది. ప్రతి వార్డు, కాలనీ అసోసియేషన్‌లతో మమేకమైతున్నది. ఇది ఇలా ఉండగా.. ఒకేసారి ఎక్కువ మందిని కలిసేందుకు పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. ఇందుకోసం మంచి ముహూర్తాల కోసం ఎదురుచూస్తున్నాయి. పెండ్లిళ్లు, గృహ ప్రవేశాలకు మంచి ముహూర్తాలు పెట్టుకోవడంతోపాటు చిన్నపాటి దావత్‌లు, ఎంగేజ్‌మెంట్లకు సైతం డేట్‌లు ఫిక్స్ అయ్యాయి. ఆయా దావత్‌లు, పెండ్లిళ్లలోనే ఎక్కువ మంది ఓటర్లను కలిసేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. ఆయా కులాలు, మతాల వారీగా ఏ నాయకుడిని ఆ దావత్‌కు తీసుకెళ్లాలి? ఎంత మందితో వెళ్తే అక్కడ ప్రభావం చూపగలం, అక్కడ ఎంతమందిని కలిసే అవకాశం ఉంటుంది? అది ఎంత వరకు సానుకూలంగా మారుతుంది? ఇలా అన్ని కోణాల్లో ఆలోచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆయా సామాజికవర్గాలకు చెందిన ముఖ్య నేతలను, అవసరమైనచోటికి నేరుగా అభ్యర్థిని తీసుకెళ్లేందుకు స్థానిక నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాలను నేరుగా అభ్యర్థికే తెలియజేస్తున్నారు. అందుకు అనుగుణంగా సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఆయా పార్టీ బాధ్యతలు చూసే సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇవన్నీ భుజాన వేసుకుంటున్నారు. పార్టీ అనుచరులతో కలిసి ఆయా వేడుకలకు వెళ్తున్నారు. ఊర్లో ఎవరెవరి పెండ్లిళ్లు, గృహ ప్రవేశాలు ఉన్నాయి? ఏ డేట్‌లు ఫిక్స్ అయ్యాయి? అక్కడకు ఏయే వర్గాలు వచ్చే అవకాశం ఉన్నది? పంచిన కార్డులు ఎన్ని? వారికి ఉన్న బలగమెంత? ఎంత మంది అక్కడకు రావొచ్చు? మనం ఎవరిని తీసుకెళ్తే ఎక్కువ ప్రభావం చూపగలం.. ఇలా అనేక కోణాల్లో చర్చిస్తున్నారు. ఆయా ముహూర్తాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. దావత్‌లు, లగ్గాలు చెప్పుడే ఆలస్యం.. పక్కాగా హాజరవ్వాలని చూస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఎన్నికల ప్రచారాల వేళ దావత్‌లు, రిసెప్షన్‌లకు ఆహ్వానిస్తున్నవారు సైతం నాలుగు బుక్కలు, ముక్కలు ఎక్కువ వండేందుకు సిద్ధమవుతున్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తారామతిపేట గ్రామంలో జరిగిన ఓ వేడుకలో మ్యానిఫెస్టో అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు





# పేదింట.. కల్యాణ కాంతులు

- **ఆడబిడ్డల తల్లిదండ్రులకు 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' భరోసా**
- **మేనమామ వలె రూ.1,00,116లను కానుక ఇస్తున్న సీఎం కేసీఆర్**
- **జిల్లాలో 27,895 మందికి చేకూరిన లబ్ధి**
- **ఇందుకోసం రూ.300కోట్లు వెచ్చించిన ప్రభుత్వం**
- **జిల్లాలో గణనీయంగా తగ్గిన బాల్య వివాహాలు**

వికారాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఆర్థికంగా ఆదుకునేందుకుగాను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నది. నిరుపేద దళిత, గిరిజన, బీసీ, ఓబీసీ, మైనార్టీ కులాలకు చెందిన యువతుల పెండ్లిళ్లకు రూ.లక్షా116లను అందజేస్తున్నది. తొలుత రూ.51 వేల ఆర్థిక సాయాన్ని అందించిన ప్రభుత్వం.. తదనంతరం రూ.75,116లకు పెంచింది, అన్నింటి ధరలు పెరిగిన దృష్ట్యా ప్రస్తుతం పేదింటి ఆడబిడ్డలకిచ్చే సాయాన్ని రూ.లక్షా116లకు పెంచి ఇస్తున్నది. గత ఎనిమిదేండ్లలో పేద కుటుంబాల ఆడబిడ్డల పెండ్లిళ్లకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్ల వరకు ఆర్థిక సాయాన్ని అందజేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు ఎలాంటి అడ్డంకులు రాకుండా ఏటా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నది. తొలుత లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో అందజేయగా, తదనంతరం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

**పేదింటి ఆడబిడ్డలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం..**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో గత ఎనిమిదేండ్లలో రూ.300 కోట్ల ఆర్థిక సాయాన్ని పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకుగాను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద ఇప్పటివరకు 27,895 మంది లబ్ధిదారులకు రూ.300 కోట్ల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కల్యాణలక్ష్మి పథకం కింద 2016-17 ఆర్థిక సంవత్సరంలో 1677 మంది దరఖాస్తు చేసుకోగా 1360 దరఖాస్తుదారులకు రూ.51 వేల చొప్పున రూ.6.93 కోట్ల ఆర్థిక సాయాన్ని, షాదీముబారక్ పథకం కింద 519 మంది దరఖాస్తు చేసుకోగా 464 మంది దరఖాస్తుదారులకు రూ.2.36 కోట్ల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెక్కుల రూపంలో అందజేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా 3332 దరఖాస్తులురాగా 3236 మంది దరఖాస్తుదారులకు రూ.16.50 కోట్లు, షాదీముబారక్ పథకం కింద 741 దరఖాస్తులురాగా 724 దరఖాస్తుదారులకు రూ.3.64 కోట్ల ఆర్థిక సాయాన్ని రూ.51 వేల చొప్పున అందజేయడం జరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కల్యాణలక్ష్మి పథకం కింద 3814 దరఖాస్తులు రాగా 3750 దరఖాస్తుదారులకు రూ.లక్షా116 చొప్పున రూ.37.54 కోట్లు, షాదీముబారక్ పథకం కింద 847 దరఖాస్తులు రాగా 841 దరఖాస్తుదారులకుగాను రూ.8.41 కోట్ల ఆర్థిక సాయాన్ని అందజేశారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 4583 దరఖాస్తులకుగాను రూ.45.88 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 5506 దరఖాస్తులకుగాను రూ.55.12 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 5419 దరఖాస్తులకుగాను రూ.54.25 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1483 దరఖాస్తులకుగాను రూ.14.84 కోట్ల ఆర్థిక సాయాన్ని పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు ప్రభుత్వం ఇచ్చింది.

**ఆడబిడ్డల పెండ్లిళ్లకు రూ.లక్షా116 సాయం..**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అక్టోబర్2, 2014 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. తొలుత ఆర్థిక సాయాన్ని రూ.51 వేలను అందించిన ప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక సాయాన్ని రూ.75,116గా పెంచింది. పెరిగిన ధరల దృష్ట్యా 2018 మార్చి నుంచి రూ.లక్షా116లకు పెంచింది. తొలుత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే అర్హులని నిర్ణయించినప్పటికీ 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి నుంచి బీసీ, ఈబీసీలకూ కల్యాణలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఆర్డీవోలు నిర్వహిస్తున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకుగాను మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం తహసీల్దార్లకు, క్షేత్రస్థాయిలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేస్తున్నారు. ఆర్డీవోలు దరఖాస్తులను పరిశీలించి ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులకు దరఖాస్తుల జాబితా చేరుతుంది. శాసనసభ్యులు సంబంధిత జాబితాకు ఆమోదం తెలిపిన అనంతరం ఎమ్మెల్యేల ద్వారా లబ్ధిదారులకు సాయం అందుతున్నది. ఈ పథకాల కింద ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాలను నేరుగా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అసలైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

### అప్పు బాధ తప్పింది..



కల్యాణలక్ష్మి పథకం వచ్చాక పేదలకు అప్పుల బాధ తప్పింది. పథకం ప్రవేశపెట్టక ముందు ఆడబిడ్డ పెండ్లి చేయాలంటే అప్పు చేయాల్సిందే. పథకం వచ్చాక పెండ్లికి ఎంతో ఆసరా అవుతున్నది. సీఎం కేసీఆర్ ఆడబిడ్డల మేనమామగా గుండెల్లో నిలిచారు. ఇంత మంచి ప్రభుత్వానికి మరోసారి ఓటు వేస్తా.

– మాణ్యమ్మ, మైల్వార్

### ఆడబిడ్డల పెండ్లికి భరోసా..



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడబిడ్డల పెండ్లిళ్లకు కొండంత భరోసానిస్తున్నాయి. మా బిడ్డ పెండ్లి చేసిన కొన్ని రోజుల్లోనే రూ. లక్షా,116ల కల్యాణలక్ష్మి చెక్కు వచ్చింది. దీంతో ముందుగా చేసిన అప్పులు కట్టుకున్నా. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవు. ప్రజల శ్రేయస్సు కోరుకునే బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెంటే ప్రజలు ఉన్నారు. మళ్లీ మూడో సారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం.

– అనసూయ, షాద్‌నగర్‌టౌన్

### కల్యాణలక్ష్మి పథకం చాలా గొప్పది..



ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన కల్యాణలక్ష్మి పథకం చాలా గొప్పది. నిరుపేదల కుటుంబాల్లోని ఆడబిడ్డల పెండ్లిళ్ల సమయంలో ఈ పథకం ఎంతో ఆదుకుంటున్నది. ఆడపడుచు పెండ్లికి ప్రభుత్వం రూ.1,00,116లు అందజేస్తున్నారు. ఈ పథకంతో నిరుపేదల కుటుంబాలకు సీఎం కేసీఆర్ సార్ మేనమామ అయ్యిండు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆడబిడ్డ పెండ్లికి సాయం చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం చేస్తున్న సాయంతో ఖర్చుల భారం తగ్గుతున్నది. కల్యాణలక్ష్మి పథకంతో పేదలను ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌కే మళ్లీ ఓటు వేస్తా.

– బాలమణి, కడ్తాల్ మండలం



### పేద కుటుంబానికి భరోసా..



పేద కుటుంబానికి కల్యాణలక్ష్మి ఎంతో భరోసా ఇస్తున్నది. సీఎం కేసీఆర్ ఈ పథకంతో పేదలకు ఆర్థికంగా సాయం చేస్తున్నారు. మా కుమార్తె కుమార్తె వివాహం చేశాను. మాకు ఎకరం ఇరవై గుంటల భూమి ఉన్నది. వ్యవసాయంతో పాటు ఇతర పనులను చేసుకుంటున్నాం. సీఎం కేసీఆర్ పేదల కోసం తెచ్చిన కల్యాణలక్ష్మి పథకం ద్వారా వచ్చిన లక్షా నూటా పదహారు రూపాయల సాయం అందింది. ఆర్థికంగా చేయూతనందుస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– బోయిని మంగమ్మ, అయినాపూర్(దోమ )

### ఆడ బిడ్డ పెండ్లికి సాయం చేయడం సంతోషకరం..



ఆడబిడ్డ పెండ్లి సాయం చేయడం చాలా సంతోషకరం. ఇదివరకు అమ్మాయి పెండ్లి చేయాలంటే నానా ఇబ్బందులు పడేటోళ్లం. అప్పులు తీసుకురావాల్సిన పరిస్థితి ఉండేది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకలతో కొంతమేర ఉపశమనం లభిస్తున్నది. గత 70 ఏండ్ల పాలనలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి పథకాలను అమలు చేయలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నది. నా బిడ్డ పెండ్లి చేశాను. సర్కార్ నుంచి రూ.లక్ష 116 సాయం అందింది. మేనమామ పాత్ర పోషిస్తున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– లలిత ఊరేళ్ల గ్రామం, చేవెళ్ల మండలం


### పేదల పెన్నిధి కేసీఆర్



పేదల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల పెన్నిధి అయ్యారు. కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు ఎంతో ఆసరా అవుతున్నది. దేశంలో నేను ఎక్కడా ఇలాంటి పథకం చూడలేదు. మన రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తుండడం సంతోషకరమైన విషయం. సబ్బండ వర్ణాల కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇటువంటి సీఎం ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. గతంలో ఆడ బిడ్డ పెండ్లి చేయాలంటే అప్పులు చేసే దుస్థితి ఉండేది. రాబోవు ఎన్నికల్లో కేసీఆర్ గెలిస్తే ఇప్పుడు ఇస్తున్న దానికి రెట్టింపు ఇస్తామన్నారు. ఇది చాలా సంతోషించాల్సిన అంశం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ కేసీఆర్‌కు రుణపడి ఉంటారు.

– గుడుపల్లి అంజమ్మ, ఆలూర్ గ్రామం, చేవెళ్ల మండలం

### తల్లి దండ్రులకు కొండంత భరోసా..



అడపిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి పథకం కొండంత భరోసాను ఇస్తున్నది. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా సంతోషకరం. అర్హులైన ప్రతి అడపడుచు పెండ్లికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నది. నా కూతురి వివాహానికి కల్యాణలక్ష్మి పథకం కింద రూ.100116లు వచ్చాయి. ఎవరి అలోచించని విధంగా సీఎం కేసీఆర్ అలోచన సరళీ ఉంటుంది.మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో ఆర్థిక అసమానతలు తొలుగుతున్నాయి.

–సుధాకర్, గాంధీనగర్ కాలనీ, షాద్‌నగర్ రూరల్

